రైతు బజారు ఏర్పాటు ఇంకెప్పుడు?

- పట్టణీకరణ చెందుతున్న నున్న గ్రామం
- ఇతర రాష్ట్రాల నుంచి పలువురు వచ్చి ఇక్కడ నివాసం
- వేగంగా పెరుగుతున్న అపార్టుమెంట్ కల్చర్
- రైతుబజారు ఏర్పాటుతో స్థానిక రైతులకు ఉపాధి
- ప్రజలకు సరసమైన ధరలకు నాణ్యమైన కూరగాయలు


నున్న గ్రామంలో కూరగాయల విక్రయం

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలో రైతు బజారు ఏర్పాటు కోసం రైతులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నారు. నున్న, విలేజి కండ్రిక, పాతపాడు, పి.నైనవరం, అంబాపురం గ్రామాలతో పాటు అనేక గ్రామాలకు కూడలిగా వున్న నున్న గ్రామంలో రైతు బజారు ఏర్పాటు చేయాలనే మార్కెటింగ్ శాఖ ప్రతి పాదనలు ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు. పైన పేర్కొన్న గ్రామాల్లో ఉద్యాన పంటలు, కూరగాయలు, ఆకు కూరలు సాగు చేసి జీవనం సాగించే అనేక కుటుంబాలు ఉన్నాయి. నున్న గ్రామంలో ప్రభుత్వం రైతు బజారు ఏర్పాటు చేస్తే సన్న, చిన్న కారు రైతులు తాము పండించిన ఆకు కూరలు, కూరగాయలు, ఉద్యాన పంటలను రైతు బజారులో విక్రయించుకుంటూ మేలైన జీవనోపాధిని పొందే వీలుంటుంది. తద్వారా ప్రభుత్వం ఆశించిన పేదరిక నిర్మూలన కొంత వరకైనా మంచి ఫలితాలను సాధించవచ్చునని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. నున్న గ్రామాన్ని ఆనుకుని ఉన్న సూరంపల్లి, చనుపల్లివారి గూడెం, అడవినెక్కలం గ్రామాల్లో సన్న, చిన్న కారు రైతులు తమ పంటలను పాయకాపురం రైతు బజారుకు తీసుకెళ్లి అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు.



రైతు బజారు ఏర్పాటు చేయాలి

నున్న గ్రామం అనేక గ్రామాలకు కూడలి. కూరగాయలు, ఆకు కూరలు పండించే సన్న, చిన్న కారు రైతులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. రైతు బజారు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

–దండు సుబ్రహ్మణ్యం రాజు, మార్కెట్ కమిటీ మాజీ సభ్యుడు, నున్న



ఉపాధి అవకాశాలు లభిస్తాయి

నున్నలో రైతుబజారు ఏర్పాటు ద్వారా అనేక మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. నాణ్యమైన కూరగాయలు సరసమైన ధరలకే అందుబాటులో ఉంటాయి. రైతు బజారులో కూరగాయలతో పాటు నిత్యావసర వస్తువులు లభిస్తాయి.

– మున్నంగి శివయ్య, కూరగాయల వ్యాపారి

నున్న గ్రామంలో రైతుబజారు ఏర్పాటు చేస్తే ఆయా గ్రామాల రైతులకు సౌకర్యంగా ఉంటుంది. 2014వ సంవత్సరంలో అప్పటి వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ పాలక వర్గం సభ్యుడు దండు సుబ్రహ్మణ్యం రాజు నున్న గ్రామంలో రైతు బజారు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఆ మేరకు అప్పటి మార్కెటింగ్ శాఖ అసిస్టెంటు డైరెక్టర్ దివాకర్ నున్న గ్రామంలో స్థలాన్ని పరిశీలించి గ్రామ పంచాయతీ నుంచి తీర్మానం కోరారు. వెంటనే నున్న గ్రామ పంచాయతీ తీర్మానం చేసి ఇచ్చింది. అందుకు నిధులు మంజూరు కాక పోవడంతో ఆ ప్రతిపాదన ఆగిపోయింది. మళ్లీ 2024వ సంవత్సరంలో గన్నవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో నున్న గ్రామం చేరడంతో అప్పుడు కూడా రైతు బజారు ఏర్పాటుపై అధికారులు నున్న గ్రామంలో స్థలాన్ని పరిశీలించి, నిధులు మంజూరుకు కమిటీ సమావేశం తీర్మానించింది. మార్కెటింగ్ శాఖ నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో రైతు బజారు ఏర్పాటు ప్రతిపాదన దశలోనే నిలిచి పోయింది.


రైతుబజారు ఏర్పాటుకు గుర్తించిన స్థలం

విస్తరణ దిశగా నున్న గ్రామం

విజయవాడ నగరానికి ఆనుకుని ఉన్న నున్న గ్రామంలో అపార్టుమెంటు కల్చర్ పెరుగుతోంది. వారంతా ప్రతి రోజూ బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు కూరగాయలను కొనుగోలు చేస్తున్నారు. తూకంలో మోసాలు జరుగుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. చిరు వ్యాపారులు, పాయకాపురం రైతు బజారుకు వెళ్లి కూరగాయలను కొనుగోలు చేసి మారుబేరానికి అమ్ముకుంటున్నారు. ఒడిశా, బిహార్ రాష్ట్రాల నుంచి వచ్చి అనేక సంస్థల్లో ఉద్యోగాలు చేసుకునే వారు సైతం పాయకాపురం రైతు బజారుకు వెళ్లి వారానికి సరిపడా కూరగాయలను కొనుగోలు చేస్తున్నారు.

నేడు పోరంకిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: నేడు పోరంకి ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఆయన మంగళవారం వివరాలు తెలుపుతూ పోరంకి ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుతామన్నారు. ఈ కారణంగా బీజేఆర్ నగర్, నిడమానూరు రోడ్డు, మహాలక్ష్మి నగర్, విష్ణుపురం కాలనీ, సాయినగర్, లక్ష్మీపురం కాలనీ, సీతాపురం కాలనీ, బ్రహ్మంగారి గుడి, శ్రీనివాస నగర్, బందరు రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని స్థానికులు సహకరించాలని కోరారు.

మిథున్‌రెడ్డి అరెస్టు అప్రజాస్వామికం

కంకిపాడు: వైఎస్సార్ సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు అప్రజాస్వామికం అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జి.ప్రణీత్‌కుమార్ మండిపడ్డారు. స్థానిక విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికొదిలేసి పాలన సాగిస్తున్నారన్నారు. రాష్ట్రంలో విధ్వంసకర పాలన సాగుతోందని విమర్శించారు. హామీలను నెరవేర్చలేక ప్రజల దృష్టిని మరల్చేందుకు దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి తట్టుకోలేక కూటమి ప్రభుత్వం అక్రమ అరెస్టులకు పాల్పడుతోందన్నారు. పెద్దిరెడ్డి కుటుంబంపై చంద్రబాబు కుటుంబానికి ఉన్న కక్షతోనే మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టు జరిగిందన్నారు. నీచ రాజకీయాలు మానుకోకపోతే ప్రజాకోర్టులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

క్లుప్తంగా

పోక్సో చట్టంలో ఇరుక్కుంటే జీవితం జైలుపాలు



గన్నవరం: ఆడపిల్లల రక్షణ, భద్రతను దృష్టిలో పెట్టుకుని తీసుకువచ్చిన పోక్సో చట్టం గురించి విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని గన్నవరం ఎస్ఐ శ్రీధర్ సూచించారు. మండలంలోని కేసరపల్లి శివారు వీకేఆర్ కళాశాలలో మంగళవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆడపిల్లలను మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేసినా, ఇబ్బంది పెట్టినా పోక్సో చట్టం కింద కేసు నమోదు చేస్తారన్నారు. ఈ కేసులో నిందితులకు ఆరేళ్లకు పైగా జైలు శిక్ష పడుతుందన్నారు. ముఖ్యంగా విద్యార్థులు సిగరెట్, గంజాయి, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని చెప్పారు. మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

సంస్కార భారతి ఆధ్వర్యంలో నటరాజ పూజ



పెనమలూరు: కృష్ణాజిల్లా సంస్కార భారతి శాఖ ఆధ్వర్యంలో కానూరులోని శ్రీవేణుగోపాలస్వామివారి ఆలయంలో నటరాజ పూజా దినోత్సవం ఘనంగా చేశారు. ఆలయంలో సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో చిన్నారులు భగవద్గీత, సాంస్కృతిక కార్యక్రమాలు, అర్చక వేదమంత్రాలు నడుమ జరిగింది. శ్రీ వెంకట రమణాచార్యులు గురుపూజ సందర్భంగా వేద వాక్యాలు తెలిపారు. అనంతరం ఆయన్ను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. అనంతరం చిన్నారులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సంస్కార భారతి కృష్ణాజిల్లా శాఖ కార్యదర్శి విద్యాధరి, సభ్యులు జ్యోతి, సీత, కృష్ణవేణి, వరప్రసాద్, శైలజ, వైష్ణవి, వనజ, తెలుగు పండిట్‌లు పార్థసారథి, సీతారామ్ పాల్గొన్నారు.

పొలాల్లో నీటిని బయటకు పంపాలి



పెనమలూరు: వర్షాల కారణంగా నీట మునిగిన పంట పొలాలలో నీరు బయటకు పంపించే విధంగా రైతులు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం పోరంకి–కానూరు గ్రామాలలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో శైలజ మాట్లాడుతూ పంట పొలాల్లో ఎక్కువగా ఉన్న నీటిని తక్షణం బయటకు పారించాలన్నారు. నీరు ఎక్కువ కాలం పొలంలో ఉంటే వరినారు, నాట్లు వేసిన వరి దెబ్బతింటుందని అన్నారు. రానున్న మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించినందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో అనూష, రైతులు పాల్గొన్నారు.

కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్‌కు ఘన నివాళి

కంకిపాడు: కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందన్ పోరాటయోధుడని వక్తలు కొనియాడారు. పట్టణంలోని మండేపూడి భవన్‌లో అచ్యుతానందన్ చిత్రపటానికి మంగళవారం పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పి.రంగారావు, సీఐటీయూ నేత తాడంకి నరేష్, ప్రతినిధులు వి.శివశంకర్, జి.కుమారి, సీహెచ్ శ్రీహరి, వి.జాన్‌మోజెస్, వి.మరియదాసు, వై.జోజి, పి.నాగేశ్వరరావు, జి.రవికుమార్, సీహెచ్ రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని వృద్ధుడు మృతిపై కేసు

పాయకాపురం(విజయవాడరూరల్): సైకిల్‌పై వెళుతున్న వృద్ధుడిని గుర్తు తెలియని ఆటో ఢీకొనగా మృతి చెందిన ఘటనపై నున్న పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. దేవినేని గాంధీపురానికి చెందిన పీతల జాకబ్ (64) ఎస్ఎల్‌వీ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పని చేస్తుంటాడు. రోజూమాదిరిగా మంగళవారం భవానీ బార్ రోడ్డులో సైకిల్‌పై రామవరప్పాడు వైపు వెళుతుండగా భారత్ పెట్రోల్ బంక్ వద్ద గుర్తు తెలియని ఆటో వెనుక నుంచి వచ్చి ఢీ కొంది. ఆ ఘటనలో కింద పడిపోయిన జాకబ్ తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుమార్తె పీతల ప్రియాంక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వక్ఫ్ భూముల కబ్జాదారులపై కేసు

- ఆక్రమణదారుల్లో పచ్చనేతలు
- అడ్డుకోవడానికి యత్నించిన వక్ఫ్ బోర్డు అధికారులను చంపుతామని బెదిరింపు
- మొత్తం 9 మంది వ్యక్తులపై పోలీసులకు తహసీల్దార్ ఫిర్యాదు

పెనమలూరు: కొండపల్లి ఖాజీ సర్వీస్‌కు చెందిన వక్ఫ్ భూములను ఆక్రమించిన పచ్చ నేతలతో పాటు పలువురు వ్యక్తులపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప గ్రామంలో ఆర్ఎస్ నంబర్ 176లో 12.92 ఎకరాలు, పెదపులిపాకలో 12.59 ఎకరాల వక్ఫ్ భూమి ఉంది. ఈ భూములకు రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు కొద్ది రోజుల క్రితం తహసీల్దార్ గోపాలకృష్ణ ఏక్‌సాల్ లీజు కౌలు వేలంపాట నిర్వహించారు. వేలంపాట పై తుది ఉత్తర్వులు హైకోర్టు ఇవ్వాల్సి ఉంది. అయితే తొట్టెంపూడి శ్రీనివాసరావు, ముసునూరి శ్రీనివాసరావు, కలపాల కిషోర్ బాబుతో పాటు షేక్ అజీజ్, ఎండీ ఇమ్రాన్, షేక్ బుడే, షేక్ జానీ, షేక్ చిన్నా, షేక్ ఊనస్ అక్రమంగా వక్ఫ్ భూముల్లోకి చొరబడ్డారు. దీనిపై గ్రామ వీఆర్‌వో నివేదిక, వక్ఫ్‌బోర్డు అధికారులు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం వక్ఫ్ భూములు దున్నటానికి, వరి నాట్లు వేయటానికి పై వ్యక్తులు యత్నించారని పేర్కొన్నారు. అక్రమ చొరబాటును అడ్డుకోవటానికి యత్నించిన వక్ఫ్ బోర్డు అధికారులను చంపుతామని బెదిరించారని, పైన పేర్కొన్న 9 మంది వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ గోపాలకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

పరిశోధనలపై దృష్టి సారించాలి


పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

రామవరప్పాడు: దేశాభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర కీలకమని సమాజానికి ఉపయోగపడే నూతన పరిశోధనలపై విద్యార్థులు దృష్టి సారించాలని విజయ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ తూమాటి వెంకటేశ్వరరావు అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని విజయ ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఐఐటీ ఢిల్లీ సహకారంతో భారత ప్రభుత్వం నడుపుతున్న ఐసీటీ విద్యామిషన్‌లో భాగంగా 'వర్చువల్ ల్యాబ్స్' శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ల్యాబ్ పరిశోధనలను ఆన్‌లైన్ వేదిక ద్వారా ఎలా నిర్వహించుకోవాలో శిక్షణ అందిస్తున్నట్లు వివరించారు. ఐఐటీ ఢిల్లీ వర్చువల్ ల్యాబ్స్ సహకారంతో విద్యార్థుల భవిష్యత్‌కు ఉపయోగపడే శిక్షణ కార్యక్రమాలు, వర్క్‌షాపులు, ప్రాజెక్టులను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బీఎస్ అప్పారావు, కార్యదర్శి శ్రీకృష్ణ, ఐఐటీ ఢిల్లీ నుంచి రిసోర్స్ పర్సన్స్‌గా షానీ కుమార్, ఉబైద్ ముస్తాక్ నజార్, విష్ణుప్రియ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రొజెక్టర్ లేకుండా శిక్షణ ఎలా సార్ ?

విజయవాడరూరల్: వ్యవసాయ భూముల రీసర్వే మాదిరి గ్రామాల్లో గ్రామ కంఠం స్థలాల రీసర్వే కోసం మంగళవారం విజయవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణకు కనీసం ప్రొజెక్టర్ లేకపోవడంతో శిక్షణకు వచ్చిన వారు విస్తుపోయారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లోని గ్రామ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు గ్రామ కంఠం స్థలాల రీ సర్వేకు రావాల్సిందిగా ఉన్నతాధికారులు మొబైల్ ఫోన్లలో మెసేజ్‌లు వచ్చాయి. దీంతో వారు ఉదయం 9 గంటల కల్లా మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లారు. గంటల కొద్దీ కూర్చున్నా ట్రయినర్ రాలేదు. తీరా మధ్యాహ్నం 12 గంటలకు ట్రయినర్ వచ్చారు. తీరా చూస్తే ప్రొజెక్టర్ లేకుండా శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. గతంలో ట్రయినింగ్ ప్రొజెక్టర్ పైనే ఇచ్చేవారని, ఇప్పుడు ల్యాప్‌టాప్‌లో శిక్షణ ఇస్తుంటే ఎవరికీ ఏమీ కనిపించడం లేదని సిబ్బంది వాపోతున్నారు. గ్రామ కంఠం స్థలాలను ఎప్పుడు నుంచి సర్వే చేయాలనేది ప్రభుత్వం నుంచి స్పష్టమైన సమాచారం లేదు. ఇంతమంది ఉద్యోగులను శిక్షణ అని చెప్పి పిలిచి విలువైన సమయాన్ని వృథా చేశారని సిబ్బంది వ్యాఖ్యానించారు.

నోరూరించే నత్తలోయ్!



నత్తలను శుభ్రం చేస్తున్న విక్రయదారులు (ఇన్‌సెట్) ఒలిచిన నత్తలు

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో మార్కెట్‌లోకి పెద్ద ఎత్తున నత్తలు వచ్చేశాయి. నాన్‌వెజ్ ప్రియుల నోరూరిస్తున్నాయి. నత్తల్లో 80 శాతం నీరే ఉంటుంది. వీటిలో ఐనుము, మెగ్నీషియం, క్యాల్షియం, ఫాస్పరస్, నాయాసిన్, సెలీనియం వంటి పోషకాలు ఎక్కువగా ఉంటాయి. శ్వాశకోశ సమస్యలు, ఉబ్బసం, ఫైల్స్, ఆస్తమాతో ఇబ్బంది పడేవారు నత్తలు తింటే ఉపయోగం. నత్తలు తింటే గుండెకు కూడా మంచిదని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. గర్భిణులు, చిన్నపిల్లలు, రక్తహీనత సమస్యలతో ఉండే వారు నత్తలు తింటే మంచిదని అంటున్నారు. పెనమలూరు వంతెన వద్ద నత్తల విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి. నత్తలు కేజీ రూ 200–250 ధర పలుకుతోంది. నత్తలు మరో 15–20 రోజులు మాత్రమే మార్కెట్‌లో అందుబాటులో ఉంటాయని విక్రయదారులు తెలిపారు.

–పెనమలూరు

ఎస్సీ, ఎస్టీ రైతులకు నూరు శాతం సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్

పాతపాడు(విజయవాడరూరల్): ఎస్సీ, ఎస్టీ రైతులకు నూరు శాతం సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్ సిస్టమ్ అందిస్తున్నట్టు జిల్లా ఉద్యానశాఖ అధికారి పి.బాలాజీకుమార్ తెలియజేశారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పాతపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బాలాజీ కుమార్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ తోటలను సాగు చేయడం వలన రైతులకు అధిక ఆదాయం వస్తుందన్నారు. 5 ఎకరాల పైబడి పొలం ఉన్న రైతులకు 70 శాతం సబ్సిడీ సదుపాయం ఉందన్నారు. బిందు, తుంపర సేద్యంలో కూడా సబ్సిడీ ఉంటుందన్నారు. సన్న, చిన్న కారు రైతులకు ఉపాధి హామీ పథకంలో పండ్లతోటల మొక్కలను కూడా నూరు శాతం సబ్సిడీపై అందజేస్తారన్నారు. వ్యవసాయ శాఖ ఏడీఏ బి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ–క్రాప్ బుకింగ్ జరుగుతోందని, రైతులు సహకరించాలన్నారు. రైతులు యూనో లిక్విడ్ యూరియాను ఉపయోగిస్తే వృథా ఖర్చులను తగ్గించుకోవచ్చునని, భూములు సారవంతంగా వుంటాయన్నారు. ఉపాధి హామీ పథకంలో పంటపొలాలకు నీరు వెళ్లేందుకు బోదె కాల్వలు తవ్వకం పనులు జరగలేదని రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పశుసంవర్థక శాఖ డెప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్ పశువులకు నట్టల నివారణ మందు వినియోగం గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ ఏఓ రఘురామ్, ఎంపీడీఓ కార్యాలయం ఏఓ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాము అనే రైతుకు సంబంధించిన వరి నారుమడిని అధికారులు పరిశీలించారు. అనంతరం పి.నైనవరం గ్రామంలో కూడా పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది.

అభయాంజనేయుని సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి హనుమంతుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభయాంజనేయునికి తమలపాకులతో ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి. ఆలయ ప్రాంగణంలో కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు సహకారంతో 200 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ ఈవో పితాని తారకేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఆరోగ్యకర జీవనానికి ధ్యానం

దావాజిగూడెం(గన్నవరం): మండలంలోని దావాజిగూడెంలో ఉన్న శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో మంగళవారం ధ్యాన శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతి పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వాహకురాలు ఎం.నాగరమాదేవి ఆధ్వర్యంలో శ్వాస మీద ధ్యానం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన జీవనం కోసం ప్రతిఒక్కరూ ధ్యానం చేయాలని, దీనివల్ల దీర్ఘకాల వ్యాధులను, మానసిక ఒత్తిళ్లను అధిగమించవచ్చని చెప్పారు.

చదువుతోనే జీవితాల్లో మార్పు

కంకిపాడు: చదువుతోనే జీవితాల్లో మార్పులు చోటుచేసుకుంటాయని, ఉజ్వల భవితకు పునాది ఏర్పడుతుందని డాన్‌బాస్కో నవజీవన్ బాలభవన్ సంస్థ మేనేజర్ వసంతకుమారి అన్నారు. పట్టణంలోని పాశం లక్ష్మణస్వామి నగర్ ప్రాంతంలో మంగళవారం క్లస్టర్ లెవల్ కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమం నిర్వహించారు. వసంతకుమారి మాట్లాడుతూ పిల్లలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ప్రతి ఒక్కరికీ సమర్థంగా విద్య అందాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా జాగ్రత్తలు వహించాలన్నారు. డ్రాపవుట్స్ లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ టీచర్ ఎం.పెద్దింట్లమ్మ, స్థానిక పెద్దలు రంగారావు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

పెనమలూరు: అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. పోరంకి టీడీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ రూ.35 లక్షలు విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయా ఆనంద్‌ప్రసాద్, అనుమోలు ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

సీజీఆర్ఎఫ్‌తో విద్యుత్ ఫిర్యాదుల సత్వర పరిష్కారం

చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్


విద్యుత్ వినియోగదారుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్

హనుమాన్‌జంక్షన్ రూరల్: విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదులను సత్వరం పరిష్కరించి, మెరుగైన సేవలు అందించటం కోసం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు విశ్రాంత జిల్లా జడ్జి, ఏపీసీపీడీసీఎల్ సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎన్.విక్టర్ ఇమ్మానుయేల్ అన్నారు. స్థానిక విజయవాడ రోడ్డులోని రాయల హంపి కల్యాణ మండపంలో విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) ఆధ్వర్యంలో మంగళవారం విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు హాజరైన విక్టర్ ఇమ్మానుయేల్ మాట్లాడుతూ గుణదలలోని సీజీఆర్ఎఫ్ కార్యాలయంలో లేదా ఆన్‌లైన్ ద్వారా కానీ విద్యుత్ వినియోగదారులు తమ అర్జీలను నేరుగా సమర్పించవచ్చని తెలిపారు. గత ఏడాది కాలంలో 200కు పైగా విద్యుత్ సమస్యలను సీజీఆర్ఎఫ్ పరిష్కరించినట్లు చెప్పారు. సదస్సులో మొత్తం 14 అర్జీలను స్వీకరించగా, పలువురు స్మార్ట్ మీటర్లపై అభ్యంతరాలను వ్యక్తం చేశారు. గుడివాడ ఆటో నగర్ కార్మికులు, బాపులపాడు, ఉంగుటూరు సీపీఎం నాయకులు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయవద్దంటూ వినతిపత్రాలను సమర్పించారు. దీనిపై సీపీడీసీఎల్ ఎస్ఈ సత్యానంద్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల వల్ల అధిక బిల్లు లేదా విద్యుత్ రీడింగ్ నమోదు అవుతున్నట్లుగా అపోహలు ఉంటే, వారికి ప్రస్తుతం ఉన్న మీటర్లను కూడా తనిఖీ కోసం కొనసాగిస్తామని వివరించారు. సీజీఆర్ఎఫ్ సాంకేతికసభ్యుడు ఎస్.శ్రీనివాసరావు, ఆర్థిక సభ్యుడు ఆర్సీహెచ్ శ్రీనివాసరావు, స్వతంత్ర సభ్యురాలు ఎ.సునీత, గుడివాడ ఈఈ బీవీ శ్రీనివాసరావు, హనుమాన్‌జంక్షన్ డీఈఈ బి.శ్రీనివాసరావు, ఏఈలు, లైన్‌మెన్లు పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య చర్యలతో అధిక దిగుబడులు


ఉప్పలూరులో వరి పొలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

కంకిపాడు: మేలైన యాజమాన్య చర్యలతో అధిక దిగుబడులు సాధ్యమని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ కొర్రిపాటి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఉప్పలూరు గ్రామంలో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద మంగళవారం రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వరి పొలాలను సందర్శించారు. ఏడీఏ శ్రీనివాసరావు మాట్లాడుతూ వరి పంటలో జరిగే మార్పులను గమనిస్తూ యాజమాన్య చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి రైతు బీమా చేయించాలన్నారు. కలుపు నివారణ, ఎరువుల యాజమాన్యం ఎంతో కీలకమన్నారు.

పొలం పిలుస్తోంది కార్యక్రమం

ఉప్పలూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయాధికారి వెలివెల ఉషారాణి ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు రైతు సేవా కేంద్రంలో తమ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ఎరువులు సిఫారసు మేరకు మాత్రమే వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఉప్పలూరు సొసైటీ అధ్యక్షుడు పడవల మధుసూదనరావు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ద్వారా నిస్వార్థ సామాజిక సేవ


నూతన అధ్యక్షుడు పంచకర్ల రమేష్ చక్రవర్తి దంపతులను అభినందిస్తున్న పుర ప్రముఖులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: నిస్వార్థంగా సామాజిక సేవ చేసేందుకు లయన్స్‌క్లబ్ చక్కటి స్వచ్ఛంద వేదిక అని, తోటివారికి సాయం చేసేందుకు ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని ఆ సంస్థ మల్టిపుల్ కౌన్సిల్ మాజీ చైర్మన్ లింగం శివశంకర్ చెప్పారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ హనుమాన్‌జంక్షన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం రాత్రి ఘనంగా జరిగింది. స్థానిక విజయవాడరోడ్డులోని లయన్స్‌క్లబ్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శివశంకర్ మాట్లాడుతూ పేదరిక నిర్మూలన, ఆరోగ్య సంరక్షణ, విద్యాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు లయన్స్‌క్లబ్ విశేష సేవలు అందిస్తోందన్నారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా మెడివ్యాలీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఎండీ పంచకర్ల రమేష్ చక్రవర్తి, ప్రధాన కార్యదర్శిగా మాకినేని శ్రీనివాసరావు, కోశాధికారిగా అక్కినేని రాఘవేంద్రరావు, కార్యవర్గ సభ్యులుగా నందిగం స్వామి, గూడపాటి రత్నశేఖర్‌లతో లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ మిరియాల వెంకటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కార్యవర్గానికి పలువురు పుర ప్రముఖులు దుశ్శాలువా, పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు. జిల్లా మాజీ గవర్నర్లు జేఎస్ శంకర్ గుప్తా, వైపీసీ ప్రసాద్, గద్దె శేషగిరి, వైస్ గవర్నర్ శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.